# క్లుప్తంగా

## దుర్గమ్మ నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి అనకాపల్లికి చెందిన భక్తులు బుధవారం రూ.లక్ష విరాళం సమర్పించారు. అనకాపల్లి పెరుమాళ్ల వీధికి చెందిన శ్రీనాథు శ్రీనివాసరావు దంపతులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,01,002 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, వేద పండితులు ఆశీర్వచనం, దేవస్థాన ప్రత్యేక ఆహ్వానితులు జక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

## భక్తిశ్రద్ధలతో సామూహిక శ్రీ బుధవ్రతం



మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీ శివజ్ఞాన పీఠం ఆధ్వర్యాన బుధవారం సీతారాంపురం చాపరాల వారి వీధిలో లోక కల్యాణార్థం సామూహిక శ్రీ బుధ వ్రతం ఘనంగా జరిగింది. శ్రీ శివజ్ఞాన పీఠాధిపతి శ్రీ శివాచార్య స్వామి శ్రీ బుధవ్రతాన్ని భక్తులతో సంప్రదాయబద్ధంగా చేయించారు. శ్రీ బుధవ్రతం విశిష్టతను భక్తులకు వివరించారు. ప్రజలందరికీ స్వామి వారి ఆశీస్సులు అందాలని, ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని లోకకల్యాణార్థం ఉచితంగా శ్రీ బుధవ్రతం ఏర్పాటు చేశామన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు వ్రతంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పాత్తూరు వంశీకృష్ణ, లక్ష్మీరాధిక, పీఠం ఆర్గ నైజర్ పేర్ల శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుత ఎన్నికలకు సహకరించాలి




వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సార్వత్రిక ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని వెస్ట్‌జోన్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి కోరారు. వన్‌టౌన్ పోలీసుస్టేషన్ సీఐ దుర్గాశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పారామిలటరీ సిబ్బంది బుధవారం సాయంత్రం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు భరోసా ఇచ్చేందుకు ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామన్నారు. సీపీ టి.కె. రాణా ఆదేశాలతో వన్‌టౌన్ పోలీసుస్టేషన్ లిమిట్స్‌లో సీఆర్‌పీ బలగాలతో కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


## దేశభక్తిని పెంపొందించుకోవాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు చిన్నతనం నుంచే దేశభక్తిని పెంపొందించుకోవాలని కొత్తపేట హిందూ హైస్కూల్ కార్యదర్శి కేవీఎల్వీ మోహనరావు సూచించారు. హైస్కూల్‌ని ఎనిమిదో ఆంధ్ర ఎయిర్ వింగ్ ఎన్‌సీసీ విభాగం 70వ వసంతంలోకి అడుగు పెట్టిన సందర్భంగా ఆ పాఠశాల ఆవరణలో బుధవారం వేడుకలను నిర్వహించారు. కేవీఎల్వీ మోహనరావు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఇప్పటి వరకు తమకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్న 27 మంది ఉపాధ్యాయులకు విద్యార్థులు పెయింటింగ్‌లు అందజేశారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు, ఎన్‌సీసీ ఆఫీసర్ బి.బ్రహ్మేశ్వరరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన ఏసీపీలు



రెండో ట్రాఫిక్ ఏసీపీ వంశీధర్‌గౌడ్



హోం గార్డ్ ఏసీపీ పరమేశ్వరరావు

విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రెండో ట్రాఫిక్ ఏసీపీగా వంశీధర్‌గౌడ్, హోం గార్డ్స్ ఏసీపీగా కె.వి.ఎస్.ఎన్.పరమేశ్వరరావు బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా వంశీధర్‌గౌడ్ మైదుకూరు నుంచి, పరమేశ్వరరావు హైదరాబాద్‌లోని ఏపీ యూనిట్ నుంచి జిల్లా పోలీస్ కమిషనరేట్‌కు వచ్చారు. తమ కార్యాలయాల్లో వారు బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణాను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

# జగనన్న పాలనలో పేదల సంక్షేమం

**వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్**



ప్రజలతో మాట్లాడుతున్న ఆసిఫ్, మేయర్ రాయన భాగ్యలక్ష్మి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో పేదలు అందరికీ సంక్షేమ పథకాల లబ్ధిచేకూరిందని వైఎస్సార్ సీపీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని భవానీపురం, ఊర్మిళానగర్ 43వ డివిజన్‌లో గడప గడపకు మన ఆసిఫ్ కార్యక్రమం బుధవారం జరిగింది. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డితో కలిసి షేక్ ఆసిఫ్ ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అమలు జరుగుతున్న తీరును వివరించారు. కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న పాలనలో ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాల లబ్ధి చేకూరిందన్నారు. 43వ డివిజన్‌లో కోట్లాది రూపాయలతో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. బీటీ రోడ్లు, సీసీ రోడ్లు నిర్మించామన్నారు. డ్రెయిన్లకు మరమ్మతులు చేసి మురుగు సమస్యకు పరిష్కారం చూపామన్నారు. రెండేళ్లపాటు కరోనా మహమ్మారితో ఇబ్బందులు ఎదుర్కొన్నా మూడేళ్ల కాలంలోనే అనూహ్య రీతిలో పేదలకు సంక్షేమం, అభివృద్ధిని చేరువ చేశామని వివరించారు. ఇంత అభివృద్ధి చేసిన తాము ప్రజల వద్దకు వెళ్తే, వారు స్వచ్ఛందంగా ముందుకొచ్చి మళ్లీ జగన్‌ను గెలిపించుకుంటామని స్పష్టంచేస్తున్నారని సంతోషం వ్యక్తంచేశారు. మూడు పర్యాయాలు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు మాయ మాటలు, మాయ కూటమితో ముందుకు వస్తున్నారన్నారు. వారి మాటలు నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. ఓటు వేసే ముందు ఆలోచించాలని కోరారు. మీరు వేసే ప్రతి ఓటే పేదల సంక్షేమానికి దోహదపడుతుందన్నారు. పేదల సంక్షేమానికి పాటుపడుతున్న వైఎస్ జగన్ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు.

**గీతాంజలి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి**

పేద మహిళ గీతాంజలి మృతికి కారకులైన ఐటీడీపీ వారిని కఠినంగా శిక్షించాలని ఆసిఫ్ కోరారు. తనకు ఈ ప్రభుత్వంలో మేలు జరిగిందని ధైర్యంగా చెప్పడమేనా ఆమె చేసిన నేరం అని ప్రశ్నించారు. టీడీపీ పేదలకు మేలు చేయకపోగా, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తమకు మేలు జరిగిందని తన సంతోషాన్ని పంచుకున్న మహిళపై టీడీపీ సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేసి ఆమె మృతి కారణమైందని విమర్శించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, నాయకులు జనాబ్ కరీం ఖాన్, దేవిరెడ్డి ఆంజనేయ రెడ్డి, కసిరెడ్డి రోసిరెడ్డి, దొడ్డ రాజశేఖర్‌రెడ్డి, సాంబి రెడ్డి, కేసరి రాజశేఖర్ రెడ్డి, జవ్వాజీ వెంకటరావు, భాస్కర్, మెట్టు వెంకటేశ్వర రెడ్డి, నర్సారెడ్డి, మండల శ్రీను, నరేంద్ర సింగ్, జనాబ్ నయీం తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీ పాలనలో మెరుగైన ప్రజారవాణా

**ఎంపీ కేశినేని నాని**



మినీ బస్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాల కల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషిచేస్తోందని ఎంపీ కేశినేని నాని అన్నారు. వాంబేకాలనీలో రూ.2 కోట్లతో చేపట్టిన మినీ బస్ స్టేషన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేశినేని నాని మాట్లాడుతూ.. ఒక మోడల్ బస్ స్టేషన్‌గా వాంబే కాలనీ బస్ స్టేషన్‌ను తీర్చిదిద్ది, ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించుకునేలా చూస్తామన్నారు. ఎన్టీఆర్ హయాంలో శాతవాహన ప్రయాణ ప్రాంగణాన్ని నిర్మాణం చేసుకోగా, 41 ఏళ్ల తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వాంబేకాలనీలో బస్‌స్టేషన్ నిర్మాణం చేపట్టామని పేర్కొన్నారు.

**అడిగిన వెంటనే నిధులు**

ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. నగరం విస్తరించి అజిత్ సింగ్ నగర్ ప్రాంతం అన్నింటికీ కేంద్ర బిందువుగా మారిన ప్రస్తుత తరుణంలో బస్ స్టేషన్ నిర్మాణంతో ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయం ఏర్పడుతుందన్నారు. బస్టేషన్ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లిన వెనువెంటనే రూ.5 కోట్లు మంజూరు చేయడంతో పాటు ప్రాథమికంగా రూ.2 కోట్లు విడుదల చేశారని తెలిపారు. రెండెకరాల విస్తీర్ణంలో ఐదు ప్లాట్‌ఫారాలతో ఈ మినీ బస్ స్టేషన్‌ను నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో సుమారు లక్షమంది నివసిస్తున్నారని, మరో 22 వేల మందికి నున్న, సూరంపల్లి, కొండపావులూరు, జి.కొండూరు తదితర ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు కేటాయించినట్లు చెప్పారు. ఈ మినీ బస్ స్టేషన్ నిర్మాణం జరిగితే వారందరికీ సులభతర రవాణా సదుపాయం అందుబాటులోకి వస్తుందని వివరించారు. ఎవరెంత మంది కలిసి వచ్చినా, వచ్చే ఎన్నికల్లో ప్రజల చల్లని దీవెనలతో 175 స్థానాల్లో వైఎస్సార్ సీపీ విజయదుందుభి మోగించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

**వైఎస్ జగన్ హయాంలోనే..**

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఏనాడూ నగర అభివృద్ధిపై దృష్టి సారించలేదని విమర్శించారు. అమరావతి పేరుతో నగర ప్రజలను మోసం చేశారు తప్ప విజయవాడ అభివృద్ధికి ఒక్క రూపాయి కేటాయించిన పాపాన పోలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత సకల హంగులతో నగరాన్ని తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు. రూ.500 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మించి ప్రారంభించి చూపారన్నారు. నగర అభివృద్ధికి రూ.150 కోట్ల స్పెషల్ ఫండ్స్ కేటాయించినట్లు చెప్పుకొచ్చారు. ఇటువంటి ముఖ్యమంత్రిని మరోసారి నిండు మనస్సుతో ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.గోపినాథ్ రెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.వై.దానం, నాయకులు, పార్టీ శ్రేణులు, స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల సాకారం

**వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్**



లబ్ధిదారులకు పట్టాలను అందచేస్తున్న ఆసిఫ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): పేదల సొంత ఇంటి కలలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాకారం చేశారని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్ అన్నారు. చిట్టినగర్ 47వ డివిజన్ పరిధిలోని కలరా హాస్పిటల్ వద్ద బుధవారం సాయంత్రం రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ.. 'నవరత్నాలు – అందరికీ ఇళ్లు' పథకంలో రాష్ట్రవ్యాప్తంగా 31 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలలు కేటాయించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. వారికి ఇచ్చిన ఇళ్ల పట్టాలను వార్డు/గ్రామ సచివాలయాల ద్వారా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించి మరీ ఇస్తున్న మనసున్న మంచి మనిషి జగనన్న అన్నారు. పశ్చిమ నియోజకవర్గానికి చెందిన పలువురు పేదలకు అమరావతిలో ఇళ్ల స్థలాలు కేటాయిస్తే కోర్టుకు వెళ్లి అడ్డుకున్న దుర్మార్గుడు చంద్రబాబు అని మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వం పాలనలో టిడ్కో ఇళ్ల పేరుతో పేదల దగ్గర నుంచి లక్షల రూపాయలు వసూలు చేసిన చంద్రబాబు వారికి ఇవ్వకుండా దగా చేశాడని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముంత్రిని చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ, వైఎస్సార్ సీపీ నాయకులు గోదావరి బాబు, దేరంగుల వెంకట రమణ, కూరాకుల నాగ, కామళ్ల జోజి, కె.కాశేశ్వరరాజు, మద్దిరాల కమలాకర్, దిద్దుకూరి శివ, సోమిశెట్టి వెంకటేష్, రెడపంగు క్రాంతి, నాగోతి వివేక్ తదితరులు పాల్గొన్నారు.

## కుసుమ ధర్మన్న సాహిత్యానికి ప్రచారం కల్పించాలి



మాట్లాడుతున్న సూరేపల్లి రవికుమార్, కలిమిశ్రీ

విజయవాడ కల్చరల్: ఆంధ్ర ఆదిమహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు, సాహితీవేత్త కుసుమ ధర్మన్న సాహిత్యానికి విస్తృత ప్రచారం కల్పించాలని నవనిర్మాణ సంఘం వ్యవస్థాపక చైర్మన్ సూరేపల్లి రవికుమార్ కోరారు. గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ధర్మన్న తొలి అంబేడ్కరిస్ట్ అని, మాకొద్దీ నల్లదొర తనం అని నినదించిన సాహితీవేత్త అని కొనియాడారు. మార్చి 17వ తేదీ ఆయన జయంతి అని తెలిపారు. భాషా సాంస్కృతికశాఖ, తెలుగు అకాడమీ, అధికార భాష సంఘం సంయుక్తంగా ధర్మన్న జయంతి ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. కుసుమ ధర్మన్న తొలి పురస్కార గ్రహీత కలిమిశ్రీ మాట్లాడుతూ.. ధర్మన్న పేరుతో సాహితీ పీఠం ఏర్పాటు చేయాలని, ఆయన స్వస్థలం రాజమండ్రిలో పుష్కర ఘాట్‌లో ఆయన శిలా విగ్రహం ఏర్పాటు చేయాలని, విశ్వవిద్యాలయాల్లో స్మారక ఉపన్యాసం ఏర్పాటు చేయలని కోరారు. సమావేశంలో ఆశీష్ ఫౌండేషన్ చైర్మన్ సత్యస్వాతి, నవ్యాంధ్ర రచయితల సంఘం కోశాధికారి చొప్పా రాఘవేంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా దినోత్సవం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ విజయవాడ డివిజన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం రైల్వే ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రైల్వే హాస్పిటల్ సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల పాల్గొని ప్రసంగించారు. మహిళలు తమ హక్కులను తెలుసుకోవాలని సూచించారు. ఎంప్లాయిస్ సంఘ్ అధ్యక్ష కార్యదర్శులు ఆమంచి వెంకటేశ్వరావు, ఆకుల రాఘవేంద్ర మాట్లాడుతూ.. మెకానికల్, ఇంజినీరింగ్ వంటి కష్టతరమైన విభాగాల్లో పనిచేసే మహిళా కార్మికులకు సౌకర్యాలు, వసతులు ఏర్పాట్లకు ఎంప్లాయిస్ సంఘ్ ముందంజలో ఉంటోందన్నారు. సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యులు రమేష్, డేగల శ్రీను, ఇంజినీరింగ్, సీఅండ్‌డబ్ల్యూ, మెడికల్ బ్రాంచ్‌ల కార్యదర్శులు శ్రీనివాసరావు, కర్నూలు సుకుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తప్పవని కొత్తపేట సెక్టార్ ఎస్ఐ దేవసుధ హెచ్చరించారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జక్కంపూడి వైఎస్సార్ కాలనీ, గొల్లపాలెం గట్టు, గాంధీహిల్ పరిసరాల్లో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో రోడ్లపై మద్యం తాగుతున్న పలువురిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సీఐ గణేష్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో స్టేషన్ పరిధిలో బుధవారం తనిఖీలు నిర్వహించి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఆటోల్లో కూర్చుని స్థానికుల రాకపోకలకు విఘాతం కలిగించే వారికి సైతం కౌన్సెలింగ్ చేశారు.

## రూ.18 లక్షలతో కొండ ప్రాంతంలో అభివృద్ధి



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): డివిజన్‌లోని కొండ ప్రాంతంలో రూ.18 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి తెలిపారు. డివిజన్‌లోని జెండా చెట్టు కొండ ప్రాంతంలో దెబ్బతిన్న మెట్లు, డ్రెయిన్ల మరమ్మతులకు ఆదిలక్ష్మి బుధవారం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కొండ ప్రాంతాల్లో పర్యటించిన సందర్భంలో స్థానికంగా నెలకున్న సమస్యలను ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చారని ఆమె పేర్కొన్నారు. కొండ ప్రాంతాల్లో దెబ్బతిన్న మెట్లు, డ్రెయిన్లకు మరమ్మతులు నిర్వహించడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా నిర్మాణం చేపడ్తామన్నారు. కొండ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను కల్పించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. కొండ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి తెలుగుదేశం, జనసేన పార్టీలకు కనిపించడం లేదని ఎద్దేవాచేశారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబు, అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, తొత్తడి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## దేశ భాషలందు తెలుగు లెస్స

గుణదల(విజయవాడ తూర్పు): ప్రపంచ భాషల్లో తెలుగుకు ప్రత్యేకత ఉందని ఇగ్నో సీనియర్ రీజనల్ డైరెక్టర్ దోనేపూడి రామాంజనేయ శర్మ అన్నారు. ఆంధ్రలయోల కళాశాలలో తెలుగు సాహిత్యంపై బుధవారం జాతీయ సదస్సు జరిగింది. ముఖ్యఅతిథి రామాంజనేయశర్మ మాట్లాడుతూ.. ప్రాచీన భాషల్లో తెలుగుకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. దేశాన్ని పాలించిన చక్రవర్తులు, మహారాజులు సైతం తెలుగు భాష ఔన్నత్యాన్ని గుర్తించారని పేర్కొన్నారు. ముఖ్యంగా శ్రీకృష్ణదేవరాయలు తెలుగును దేశ భాషలందు తెలుగు లెస్స అని కీర్తించాడని గుర్తు చేశారు. తెలుగు భాష గొప్పతనాన్ని నేటి తరం గుర్తించాలని కోరారు. అనంతరం తెలుగు భాష ప్రత్యేకతలను విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్, తెలుగు అధ్యాపకుడు గుమ్మా సాంబశివరావు, తెలుగు విభాగాధిపతి కోలా శేఖర్ పాల్గొన్నారు.

# మొల్ల రామాయణంలో సాహిత్య విలువలు మెండు

**మేయర్ రాయన భాగ్యలక్ష్మి**



మొల్లమాంబ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భాగ్యలక్ష్మి



మొల్లమాంబ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): సుప్రసిద్ధ కవయిత్రి మొల్లమాంబ తేట తెలుగు భాషలో రచించిన రామాయణం పద్య కావ్యంలో సాహిత్య విలువలు మెండుగా ఉన్నాయని మేయర్ రాయన భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతి సందర్భంగా బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో మొల్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. మహర్షి వాల్మీకి సంస్కృతంలో విరచించిన శ్రీమద్రామాయణాన్ని ఆధారంగా చేసుకుని మొల్ల తెలుగులో రాసిన రామాయణం పద్యకావ్యం సరళమైన భాషలో ఉందన్నారు. 16వ శతాబ్దానికి చెందిన మొల్లమాంబ సాధారణ కుటుంబంలో జన్మించి ఎటువంటి సంప్రదాయ విద్యను అభ్యసించలేదని, దైవానుగ్రహంతో వచ్చిన సహజ పాండిత్యంతోనే రామాయణాన్ని రచించిందని చెప్పారు. మొల్లమాంబ వంటి పూర్వీకుల గురించి నేటి తరం తెలుసుకోవల్సిన అవసరం ఉందన్నారు. కీర్తి ప్రతిష్టల కోసం తాను నాడు రచించిన రామాయణాన్ని ఏ రాజుకూ అంకితం ఇవ్వలేదని, కేవలం తన రామ భక్తిని చాటుకునేందుకు మాత్రమేనని తెలిపారు. తెలుగు సాహిత్యంలో మొల్లమాంబ చేసిన కృషిని మహిళలు స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. అడిషనల్ కమిషనర్ (జనరల్) ఎ.మహేష్, మేనేజర్ బి.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

**మొల్లమాంబ జీవితం ఆదర్శనీయం**

లబ్బీపేట(విజయవాడతూర్పు): కవయిత్రి మొల్లమాంబ జీవితం ఆదర్శనీయమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. నగరంలోని తన కార్యాలయంలో బుధవారం మొల్లమాంబ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లమాంబ చిత్రపటానికి డీఎంహెచ్ఓ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ.. తేట తెలుగు పద్యకావ్యం మొల్ల రామాయణమని కొనియాడారు. ఆమె జీవిత చరిత్ర వంటి విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా స్టాటికల్ ఆఫీసర్ లక్ష్మీజీ మొల్లమాంబ గద్యం చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలాజీ, డాక్టర్ సమీర, డాక్టర్ శ్రావణి, డెప్యూటీ డెమో ప్రభాకరరెడ్డి, డెప్యూటీ ఎస్ఓ గోపాలకృష్ణ, డి.సత్యనారాయణరెడ్డి, భాగ్యరాజు, జూనియర్ అసిస్టెంట్ నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

**తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ**

విజయవాడస్పోర్ట్స్: రామాయణాన్ని ఆధ్యాత్మికత ఉట్టిపడేలా అద్భుతంగా రచించిన గొప్ప రచయిత్రి మొల్లమాంబ అని ఏపీఎస్ఆర్టీసీ ఎండీ సి.హెచ్. ద్వారకాతిరుమలరావు కొనియాడారు. మొల్లమాంబ జయంతి వేడుకలు ఆర్టీసీ హౌస్‌లో బుధవారం జరిగాయి. మొల్లమాంబ చిత్రపటానికి ఆయన పూల వేసి నివాళులర్పించారు. మొల్లరామాయణంతో ఆమె కీర్తిగడించారన్నారు. 16వ శతాబ్దంలోనే తొలి తెలుగు కవయిత్రిగా పేరు ప్రఖ్యాతలు సొంతం చేసుకున్నారన్నారు. సరళమైన రచనలతో శ్రీకృష్ణదేవరాయులును సైతం మెప్పించగలిగారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ సీపీఎం సామ్రాజ్యం, ఈడీలు కె.ఎస్.బ్రహ్మానందరెడ్డి, కోటేశ్వరరావు, రవివర్మ, సీఏఓ రాఘవరెడ్డి, విజిలెన్స్ ఏడీ శోభమంజురి పాల్గొన్నారు.

# మానవ జీవనాన్ని సంస్కరించే రంజాన్ మాసం



ఇఫ్తార్‌లో పాల్గొన్న ఆసిఫ్, గౌస్‌మొహిద్దీన్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మానవ జీవితాన్ని సంస్కరించే గొప్ప మాసం రంజాన్ అని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ అన్నారు. ఇస్లాంపేటలోని మినార్ మసీదులో బుధవారం సాయంత్రం జరిగిన ఇఫ్తార్ కార్యక్రమానికి షేక్ ఆసిఫ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోనే మైనార్టీలకు అభివృద్ధి సాధ్యమని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలు మైనార్టీల సంక్షేమానికి అండగా ఉన్నాయన్నారు. స్థానిక కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ గౌస్‌మొహిద్దీన్, మసీదు అధ్యక్షుడు నూర్ అహ్మద్ షరీఫ్, ఉపాధ్యక్షుడు మహ్మద్ మహబూబ్, కార్యదర్శి మహ్మద్ అలీ, సహాయ కార్యదర్శులు మహ్మద్ అబ్దుల్ షబ్బీర్, అమీర్ అలీ, కోశాధికారి అబ్దుల్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

## 18 మద్యం బాటిళ్లు స్వాధీనం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అక్రమంగా మద్యం బాటిల్స్‌ను విక్రయిస్తున్న వ్యక్తిని కొత్తపేట పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. పోలవరం కాలువ వద్ద ఎస్ఐ రాజనరేంద్ర, తన సిబ్బందితో బుధవారం గస్తీ నిర్వహిస్తుండగా, ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. ఆ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా, పి.నైనవరానికి చెందిన కోసూరి నాగరాజుగా గుర్తించారు. నిందితుడి చేతి సంచిలో 12 బీరు బాటిళ్లు, ఆరు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.